ప్రజాశక్తి
బుధవారం 17 సెప్టెంబర్ 2025
5
పార్వతీపురం మన్యం

రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖా మంత్రి సంధ్యారాణిని కొత్తగా బాధ్యతలు స్వీకరించిన కలెక్టర్ ప్రభాకర రెడ్డి అమరావతిలో మర్యాద పూర్వకంగా కలిశారు.

వైద్యం కోసం వాగు దాటాల్సిందే

వంతెనలు లేక అవస్థలు ●గిరిజనులకు తప్పని కష్టాలు

వాగు దాటుకుంటూ ఆసుపత్రికి రోగిని తీసుకెళ్తున్న బంధువులు

అడవుల మధ్య నివసించే గిరిజనుల జీవనం ఎన్నో సమస్యలతో నిండి ఉంటుంది. ముఖ్యంగా వర్షాకాలం వస్తే వారి పరిస్థితి మరింత దయనీయంగా మారుతుంది. భారీ వర్షాలతో వాగులు, వంకలు పొంగిపొర్లడంతో ప్రజల రాకపోకలు పూర్తిగా స్తంభించిపోతున్నాయి. వంతెనలు లేకపోవడం, రహదారులు లేని పరిస్థితి గిరిజనులను దైనందిన అవసరాలకే కాకుండా అత్యవసర సందర్భాల్లోనూ తీవ్రంగా ఇబ్బంది పరిస్థితులు నిత్యకృత్యంగా ఉంటుంది. ఇటీవల కురుస్తున్న వర్షాలకు తోడు ఒడిశాలో కురుస్తున్న భారీ వర్షాలకు కొండలపై నుంచి వస్తున్న భారీ నీటి ప్రవాహలతో దిగువన ఉన్న గ్రామాలను కలిపే చిన్న చిన్న వాగులు ఉధృతంగా ప్రహిస్తున్నాయి. అసలే అతుకుల బొంతలుగా వాగులపై ఉన్న కొన్ని కల్వర్టులు ఈ వరద ప్రవాహానికి కూలి పోగా, మరికొన్ని చోట్ల తక్కువ ఎత్తు ఉండడంతో వరద ఉధృతి ఎక్కువ సమయంలో వాటిపై నుంచి రాకపోకలకు ప్రజలు హడలిపోతున్నారు. అటువంటి సంఘటనే సోమవారం సాలూరు మండలం సిరివర గ్రామానికి చెందిన గిరిజనులకు ఎదురైంది.

ప్రజాశక్తి - సాలూరురూరల్

మండలంలోని సిరివర గ్రామస్తులు జ్వరాలతో ఇబ్బందులు పడుతున్నారు. వీరిని సమీపాన గల తోణాం ప్రభుత్వ ఆసుపత్రికి సిరివర నుంచి జీపుల ద్వారా రోగులు తీసుకొస్తేండే వారు. అయితే వరద ప్రవాహానికి భయపడిన జీపు డ్రైవర్లు ఎవరూ తోణాం వచ్చేందుకు ముందుకు రావడంలేదు. దీంతో చేసేది లేక రోగితో పాటు సహాయకులు వాగు ఉధృతిని తట్టుకొని ఒకరిని ఒకరు తోడు పట్టుకుని ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని వాగు దాటాల్సిన దుస్థితి నెలకొంది. ఇది ఒక్క రోజు, ఒక్కరికో జరిగిన సంఘటన కాదు. ప్రతి వర్షాకాలంలో ఇలాంటి పరిస్థితి కోకొల్లలు. చంటి పిల్లలు, గర్భిణీలు, వృద్ధులు చికిత్స కోసం ఆసుపత్రికి తోణాం వెళ్లాలంటే ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని వాగులు దాటక తప్పడంలేదు. పలుమార్లు వాగుల ప్రవాహానికి కొట్టుకుపోయి ప్రాణాలు కోల్పోయిన సంఘటనలూ జరిగాయి. అయినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదని గిరిజనులు వాపోతున్నారు.

కోట్లు ఖర్చు పెట్టి రహదారులు వేసినా లక్షలు ఖర్చు పెడితే వాగు పైన వంతెన నిర్మించవచ్చునని సిరివర గ్రామానికి చెందిన సీదరపు సున్న ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నో ఏళ్లుగా గిరిశిఖర గ్రామాలకు చెందిన గిరిజనులు ఇబ్బందులను చూసి కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఉప ముఖ్య మంత్రి పవన్ కళ్యాణ్ గిరిజన ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు నిమిత్తం ప్రతి గ్రామానికి రోడ్డు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ఆ మేరకు గతేడాది ఆగస్టులో బాగుజోల నుంచి సిరివర వరకు సుమారు రూ.8 కోట్లుతో రోడ్డు నిర్మించారు. ఈ రోడ్డు వల్ల గిరిజన గ్రామాలకు మైదాన ప్రాంతాలకు బాగా సౌకర్యం కల్పించినట్లు అయిందని, కానీ ప్రధానంగా ఆ రహదారి నుంచి దుగ్గేరుకు రావాలంటే దుగ్గేరు పక్కనుండే ఈ వాగుపై వంతెన నిర్మించాల్సి అవసరం ఎంతైనా ఉందని స్థానిక గిరిజనులు కోరుతున్నారు. ఇక్కడ వర్షం పడితే వాగు దాటడం కష్టతరమైన పని అని, కావున ప్రభుత్వం తక్షణమే స్పందించి ఈ వాగుపై వంతెన నిర్మించాలని గిరిజనులు ప్రభుత్వాన్ని కోరారు.

విద్యారంగ, ఆర్థిక సమస్యలు పరిష్కరించాలి

యుటిఎఫ్ రణభేరి జాతాలో నాయకుల డిమాండ్

పార్వతీపురంలో ర్యాలీ చేస్తున్న యుటిఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు

ప్రజాశక్తి - పార్వతీపురం

ఉపాధ్యాయుల విద్యారంగ, ఆర్థిక సమస్యలు పరిష్కరించాలని కోరుతూ యుటిఎఫ్ చేపట్టిన రణభేరి ప్రచారజాతా మంగళవారం మన్యం జిల్లాలో కొనసాగింది. సీతంపేటలో ప్రారంభమైన ఈ జాతా నీలకంఠాపురం, కురుపాం మీదుగా పార్వతీపురం చేరుకొని కొత్తవలస ఫ్లై ఓవర్ నుంచి రణభేరి ప్రచార రథంతో పాటు ఉపాధ్యాయులు చర్చి జంక్షన్ వరకూ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి రెడ్డి మోహనరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15 నెలలు పూర్తయినా విద్యారంగంలోని సమస్యలను పరిష్కరించడంలోను, ఆర్థిక బకాయిలు చెల్లించడంలో ఏ మాత్రం శ్రద్ధ చూపడం లేదని విమర్శించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు బోధనేతర కార్యక్రమాలతో సతమతమవుతున్నారని, వెంటనే వాటిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిషోర్ కుమార్ మాట్లాడుతూ యాప్‌లను రద్దు చేస్తామన్న విద్యాశాఖ లీప్ యాప్‌లోనే అనేక యాప్‌ల పని భారాన్ని చూపించిందని, దీంతో ఉపాధ్యాయులు పిల్లలకు పాఠాలు చెప్పే విలువైన సమయాన్ని కోల్పోతున్నారని, ఇది ప్రభుత్వ విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేస్తుందని దుయ్యబట్టారు. 12వ వేతన సవరణ సంఘం కమిషనర్‌ను నియమించి వెంటనే మధ్యంతర భృతి చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈనెల 25న రాష్ట్ర కేంద్రంలో పెద్ద ఎత్తున సమావేశం నిర్వహించి భవిష్యత్ కార్యాచరణ రూపొందించి ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని పేర్కొన్నారు. యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు కె.విజయగౌరి మాట్లాడుతూ ఈ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 4 డిఎలను అమలు చేయకుండా తాత్సారం చేస్తుందని విమర్శించారు. తక్షణమే ఆర్థిక బకాయిలు అన్నింటినీ విడుదల చేయాలని కోరారు. లేని పక్షంలో పెద్దఎత్తున ఉపాధ్యాయులు ఉద్యమిస్తామని ప్రభుత్వానికి హెచ్చరించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మురళీమోహన్‌రావు, మన్యం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.భాస్కరరావు, అధ్యక్షులు టి.రమేష్, జిల్లా సహాధ్యక్షులు వి.జ్యోతి, జిల్లా కోశాధికారి కె.మురళీ, జిల్లా కార్యదర్శులు ఎన్.శ్రీనివాసరావు, ఎం.పైడిరాజు, కె.గోవిందమ్మ, పి.వెంకటినాయుడు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీతంపేట: స్థానిక బాలుర ఆశ్రమ పాఠశాల ప్రాంగణంలో రణభేరి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి రెడ్డి మోహన్‌రావు, రాష్ట్ర కార్యదర్శి ఎస్ కిషోర్ కుమార్, మురళీమోహనరావు మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా ఐదు దళాలుగా పర్యటించి ఉపాధ్యాయులను ఉద్యమానికి సిద్ధం చేసి కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని అన్నారు. ఈనెల 25న విజయవాడలో వేలాది మంది ఉపాధ్యాయులతో బహిరంగ సభ నిర్వహించి సమస్యలు పరిష్కారానికి ప్రభుత్వానికి అల్టిమేట్ ఇచ్చేందుకు రణభేరి మోగించాలని నిర్ణయించినట్లు తెలిపారు. నాణ్యమైన విద్య నందిస్తామని చెబుతూనే ప్రభుత్వ పాఠశాల నుంచి విద్యార్థులు ప్రైవేటుకు తరలిపోయేలా కార్యక్రమాలు రూపొందిస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో గౌరవాధ్యక్షులు ఎ.భాస్కరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి కె.భాస్కర్ రావు, రాష్ట్ర నాయకులు దండు ప్రకాష్, మండల ప్రధాన కార్యదర్శి బిడ్డిక ఫకీరు, జిల్లా కార్యదర్శి కె.కృష్ణారావు, జిల్లా అధ్యక్షులు టి.రమేష్ , మండల నాయకులు పి.కృష్ణారావు, సింహాద్రి, గాసయ్య, చంద్రరావు. తదితరులు పాల్గొన్నారు.

సీతంపేటలో రణభేరి జాతాను ప్రారంభిస్తున్న యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు

కురుపాం : ఉపాధ్యాయుల ఆర్థికపరమైన సమస్యలు పరిష్కరించాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శులు ఎస్.మురళీమోహన్, కిషోర్ డిమాండ్ చేశారు. మండలంలోని నీలకంఠాపురం గ్రామం నుంచి యుటిఎఫ్ రణభేరి కార్యక్రమంలో భాగంగా బైక్ ర్యాలీతో గుమ్మలక్ష్మీపురం మీదుగా కురుపాం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు కె.భాస్కర్‌రావు, పైడిరాజు, ఎన్.శ్రీరాములు, బి.కూర్మారావు,కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

సీతానగరం: యుటిఎఫ్ తలపెట్టిన రణభేరి ప్రచార జాతాకు మండలంలోని మరిపివలస వద్ద సీతానగరం మండల యుటిఎఫ్ శాఖ ఘన స్వాగతం పలికింది. కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు రెడ్డి మోహనరావు, మురళీమోహనరావు, కిశోర్‌కుమార్, కె.విజయగౌరితో పాటు మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి. శ్రీనివాసరావు, బి.ప్రసాదరావు, జిల్లా కౌన్సిల్ సభ్యులు ఎం.గోవిందరావు, జి. పోలినాయుడు, కె.ఉమామహేశ్వరరావు, బి.రామకృష్ణ, శంకరరావు తదితరులతో పాటు పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సాలూరు: యుటిఎఫ్ రణభేరి జాతా మంగళవారం సాయంత్రం స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్దకు చేరుకుంది. యుటిఎఫ్ జిల్లా సహ అధ్యక్షులు బి విజయ్ కుమార్ అధ్యక్షతన జరిగిన ముగింపు సభలో రాష్ట్ర కోశాధికారి రెడ్డి మోహనరావు, రాష్ట్ర కార్యదర్శులు కిషోర్, మురళీమోహన్, రాష్ట్ర నాయకులు విజయ గౌరి, మన్యం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు, రమేష్, కె భాస్కరరావు మాట్లాడారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా నాయకులు జ్యోతి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మధు, కౌన్సిల్ సభ్యులు రాజమణి, ఆడిట్ కమిటీ కన్వీనర్ వెంకటనాయుడు, జిల్లా కోశాధికారి మురళి, జెవివి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మహేశ్వరరావు, గౌరినాయుడు, యుపిఎఫ్ సీనియర్ నాయకులు ఎవి రామారావు, జానకీరాం, ఆకుల గణపతి, సీతయ్య మాస్టారు, పాచిపెంట, సాలూరు మండల, పట్టణం, మక్కువ మండలాల యుటిఎఫ్ అధ్యక్ష కార్యదర్శులు, ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

పాఠశాలల్లో ఆహ్లాదకర వాతావరణం అవసరం : జెసి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

ఐటిడిఎ పరిధిలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో ఆహ్లాదకర వాతావరణం ఉండేలా చర్యలు చేపట్టాలని జాయింట్ కలెక్టర్, ఇన్‌ఛార్జి ఐటిడిఎ పిఒ సి.యశ్వంత్‌కుమార్ రెడ్డి పేర్కొన్నారు. ప్రతి పాఠశాల పరిశుభ్రంగా ఉండాలని, మౌలిక వసతుల లోటు ఉండరాదని అన్నారు. మండలంలోని రావికోన గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలను మంగళ వారం జెసి ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు పట్టీని పరిశీలించిన ఆయన విద్యార్థులు, ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని ఆదేశించారు. స్టోర్ రూమ్, స్టాక్ రిజిస్టర్లు, కిచెన్ షెడ్, టాయిలెట్లు, పారిశుధ్యం, డ్రైనేజీ వ్యవస్థను పరిశీలించి, పాఠశాల ఆవరణ అంతటా పరిశుభ్ర వాతావరణం ఉండాలని సూచించారు. అప్పుడే విద్యార్థులు మంచి విద్యను అభ్యసించగలరని, కావున సరైన పరిశుభ్రత పాటించాలని సిబ్బందిని ఆదేశించారు. అంతకు ముందు విద్యార్థులతో సంభాషించి వారి నోట్ బుక్స్, వర్క్ బుక్స్‌ను తనిఖీ చేసి, విద్యా ప్రమాణాలు మరింత పెరిగేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. అనంతరం పార్వతీపురంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జేసీ తనిఖీ చేశారు. సిబ్బంది రిజిస్టర్లు, ఒపి రిజిస్టర్, లేబర్ రూమ్, ఒపి డిస్పెన్సరీ రూమ్‌లను సందర్శించి, అక్కడి రోగులతో సంభాషించారు. ఆరోగ్య సేవలు అందుతున్న తీరు, రోగుల పట్ల వైద్యులు, సిబ్బంది తీరు, ఉచిత మందులు పంపిణీపై ఆరా తీశారు. ఒపి యాప్ వినియోగంతో పాటు పిహెచ్‌సి ప్రాంగణాన్ని ఎల్లవేళల అత్యంత పరిశుభ్రంగా ఉంచాలని, రోగుల పట్ల మర్యాదపూర్వకంగా నడుచుకోవాలని వైద్యాధికారులను, సిబ్బందిని ఆదేశించారు. అక్కడి నుంచి పెదబొండపల్లి అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించిన ఆయన అంగన్వాడీ సిబ్బందికి పలు సూచనలు చేశారు. ధృవీకరించబడిన స్టాక్ రిజిస్టర్లు, అంగన్‌వాడీ సూపర్‌విజన్ యాప్‌లోని రికార్డులను సమీక్షించి, యాప్ వినియోగాన్ని స్వయంగా పరిశీలించారు. ఈ పర్యటనలో వైద్యాధికారులు, ఉపాధ్యాయులు, అంగన్వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మూడేళ్ల కాలపరిమితి సర్క్యులర్ రద్దు చేయాలి

డిఆర్‌డి ఎ కార్యాలయం ఎదుట విఒఎల ధర్నా

ప్రజాశక్తి - పార్వతీపురం

వి ఒ ఎ ల క్ు ఉద్యోగ భద్రత కల్పించాలని, మూడేళ్ల కాలపరిమితి సర్క్యులర్ రద్దు చేయాలని కోరుతూ విఒఎల సంఘం జిల్లా అధ్యక్షులు కె.శ్రీదేవి, కె.ధర్మరాజు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక డిఆర్‌డిఎ కార్యాలయం ఎదుట విఒఎల సంఘం ఆధ్వర్యాన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విఒఎలకు మూడేళ్ల కాల పరిమితి సర్క్యులర్ రద్దు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని, హెచ్‌ఆర్ పాలసీ ప్రకటించాలని డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా కోశాధికారి జి.వెంకటరమణ, ఉపాధ్యక్షులు వి.ఇందిర మాట్లాడుతూ విఒఎల మూడేళ్ల కాల పరిమితి సర్క్యులర్‌ను మెప్మాలో రద్దు చేశారని, అదే రకంగా వెలుగు సెర్ప్‌లో కూడా సర్క్యులర్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఏళ్ల తరబడి పనిచేస్తున్న వీరికి ఉద్యోగ భద్రత కల్పించాలని, రకరకాల పనులు అప్పగించడం ద్వారా విఒఎపై పని భారం పెరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లాలో పలు యాప్‌ల లాగిన్ చేయడం ద్వారా విఒఎలు అనారోగ్యం పాలవుతున్నారని చెప్పారు. రాజకీయ వేధింపుల వల్ల జిల్లాలో 19 మంది విఒఎలను తొలగించడం అన్యాయమని, ఏళ్ల తరబడి పనిచేస్తున్నా పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస వేతనాలు పెరగడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఇస్తున్న వేతనాలు ఆరు, మూడు నెలలకు ఒకసారి చెల్లించడం దారుణమన్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే ఉద్యమిస్తామని హెచ్చరించారు. ప్రభుత్వాలు మారినప్పుడల్లా తొలగింపులు, వేధింపుల నుంచి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. విఒఏలు ఇచ్చే జీతం జిల్లాలో ప్రభుత్వ నిర్వహించే సమావేశాలకు సరిపోతుందని, అనేక కారణాలతో ప్రభుత్వ విధానాలతో బ్యాంకర్లు రికవరీ కాకపోతే విఒఎల జీతాల నుంచి రికవరీ చేయడం అన్యాయమని తెలిపారు. విఒఎల సమస్యల పరిష్కారానికి జిల్లా వ్యాప్తంగా విఒఎలంతా ఐక్యమై ఉద్యమించాలని కోరారు. అనంతరం జిల్లా వెలుగు ఎపిడి జయశ్రీకి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు హెచ్ మధు, శేషగిరిరావు, రవి, విజయ్ కుమార్, గౌరీశ్వరి, సహ కార్యదర్శి సుందర్ రావు, దేవి, ఉపాధ్యక్షులు డి.అరుణ, విజయ్ కుమార్, చంద్రకళ పెద్ద సంఖ్యలో విఒఎలు పాల్గొన్నారు.

డిఆర్‌డిఎ వద్ద నిరసన తెలుపుతున్న విఒఎలు

శ్యామలాంబ గుడికి యువరాజు ధర్మకర్త కాదు

ఎట్టకేలకు ప్రకటించిన దేవాదాయశాఖ

ప్రజాశక్తి - సాలూరు

దొంగలు పడిన ఆరునెలలకు కుక్కలు మొరిగినట్లు దేవాదాయ శాఖ అధికారులు శ్యామలాంబ ఆలయం ధర్మకర్త విషయంలో వాస్తవాన్ని వెలుగులోకి తెచ్చారు. శ్యామలాంబ గ్రామదేవత పండుగ ఈ ఏడాది మేలో జరిగింది. మూడు నెలల ముందు నుంచే పండుగ ఏర్పాట్లు చేశారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యాన పండుగ నిర్వహించారు. అయితే గత కొంతకాలంగా శ్యామలాంబ ఆలయానికి స్థానిక జమిందార్ కుటుంబానికి చెందిన విక్రం చంద్ర సన్యాసిరాజు అనువంశిక ధర్మకర్త అంటూ పట్టణంలో ప్రచారం జరిగింది. అనేక ఏళ్లుగా తానే ఆలయం అనువంశిక ధర్మకర్తనని చెప్పుకుంటూ ఆయన రాచమర్యాదలు పొందుతున్నారు. శ్యామలాంబ ఆలయం దేవాదాయ శాఖ పరిధిలో ఉంది. ఈ ఆలయానికి సంబంధించిన ఏ పండుగైనా, సంబరాలైనా దేవాదాయ శాఖ ఆధ్వర్యాన జరగాల్సి వుంది. కానీ నాలుగు నెలల క్రితం జరిగిన శ్యామలాంబ పండుగ నిర్వహణలో దేవాదాయశాఖ శాఖ అధికారులు ప్రేక్షక పాత్ర పోషించారు. పండుగ నిర్వహణ కోసం విరాళాల సేకరణ, ఏర్పాట్లు అన్నీ ఉత్సవ కమిటీ పర్యవేక్షణలోనే జరిగాయి. ఆలయ అనువంశిక ధర్మకర్తగా విక్రం చంద్ర సన్యాసి రాజేనని పదే పదే ప్రచారం చేయడంపై పట్టణానికి చెందిన సామాజిక కార్యకర్త హరి రెడ్డి జిల్లా దేవాదాయశాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. శ్యామలాంబ ఆలయానికి విక్రం చంద్ర సన్యాసి రాజు అనువంశిక ధర్మకర్త అవునా కాదా అని ప్రశ్నిస్తూ ఆయన దేవాదాయ శాఖ అధికారులకు రాసిన ఫిర్యాదులో పేర్కొన్నారు. నాలుగు నెలల ముందు అనువంశిక ధర్మకర్తపై వివరణ కోరితే దేవాదాయ శాఖ అధికారులు ఇప్పుడు దానిపై వివరణ ఇచ్చారు. విక్రం చంద్ర సన్యాసి రాజు అనువంశిక ధర్మకర్త కాదని, శ్యామలాంబ ఆలయానికి ఎవరూ ధర్మకర్త లేరని స్పష్టం చేస్తూ జిల్లా దేవాదాయ శాఖ అధికారి ఎస్.రాజారావు ప్రకటన జారీ చేశారు. గత కొన్నేళ్లు పట్టణ ప్రజల్లో, ప్రముఖుల్లో నెలకొన్న సందేహాలను ఎట్టకేలకు దేవాదాయశాఖ అధికారులు నివృత్తి చేశారు. శ్యామలాంబ ఆలయ నిర్మాణానికి రాజా విక్రం చంద్ర సన్యాసి రాజు స్థలం దానం చేశారని, బప్పా బి.బంగారు నాయుడు అనే వ్యక్తి ఆలయం నిర్మాణానికి సహకరించారని జిల్లా దేవాదాయ అధికారి జారీ చేసిన ప్రకటనలో స్పష్టం చేశారు. తమ వద్ద ఉన్న రికార్డులు, ఆధారాల ప్రకారం శ్యామలాంబ ఆలయానికి ఎవరూ అనువంశిక ధర్మకర్త లేరని తెలిపారు.

102 సిబ్బందికి కనీస వేతనాలు అమలు చేయాలి

ఉద్యోగ భద్రత కల్పించాలి ● రాష్ట్ర అధ్యక్షులు బసవరాజు

సమావేశంలో మాట్లాడుతున్న 102 ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు బసవరాజు

ప్రజాశక్తి - పార్వతీపురం

రాష్ట్ర వ్యాప్తంగా తల్లీ బిడ్డ ఎక్స్ ప్రెస్ సర్వీసుల్లో పనిచేస్తున్న కెప్టెన్లకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని తల్లీ బిడ్డ ఎక్స్‌ప్రెస్ ఎంప్లాయిస్ (102) యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు బసవరాజు, దేవీప్రసాద్ డిమాండ్ చేశారు. మంగళ వారం సుందరయ్య భవనంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. గత పదేళ్లుగా ఎంతో శ్రమకోర్చి పనిచేస్తున్న తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ సర్వీస్ ఎంప్లాయిస్ పట్ల రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం వహిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వమే తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ (102) సర్వీసులను నిర్వహించి వేతనాలు పెంచాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం అరబిందో కంపెనీ నిర్వహిస్తున్న 102 సర్వీసుల్లో పనిచేస్తున్న వారికి కేవలం రూ.10 వేలు మాత్రమే వేతనం చెల్లిస్తున్నారని, ఇందులో యజమాని చెల్లించాల్సిన పిఎఫ్ వాటాను కూడా చెల్లించకుండా కార్మికుల నుంచి వసూలు చేస్తున్నారని ఇది అత్యంత అభ్యంతరకరమని అన్నారు. కేవలం ప్రభుత్వ సర్వీసుల్లో పని చేస్తున్నామనే భావనతో భవిష్యత్తుకు భరోసా దొరుకుతున్న ఆశతో ఈ సిబ్బంది పని చేస్తున్నారని, ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం 102 సర్వీస్ సిబ్బంది సమస్యలు పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కోరారు. ప్రతి నెలా సకాలంలో జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. లేనిచో 102 సర్వీస్‌ల్లో పనిచేస్తున్న వారిని ఐక్యం చేసి ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి బివి రమణ,102 యూనియన్ జిల్లా అధ్యక్షులు శ్రీధర్, ఉపాధ్యక్షులు వాసు, వెంకట నాయుడు తదితరులు పాల్గొన్నారు.

నాలుగో విడత కౌన్సిలింగ్‌కు దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక ప్రభుత్వ ఐటిఐలో ప్రవేశాలకు నాలుగో విడత దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ ఎం.గోపాలకృష్ణ కోరారు. ఆన్‌లైన్‌లో iti.ap.gov.in వెబ్ సైట్ ద్వారా ఈనెల 27 వరకు దరఖాస్తు చేసుకోవచ్చున్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులంతా ఈనెల 28లోగా తమ నమోదు యునిక్ నెంబర్, అన్ని ఒరిజినల్ సర్టిఫికేట్లతో తమ దగ్గరలో గల ఏ ప్రభుత్వ ఐటిఐ నందైనా తనిఖీ (ధవీకరణ) చేయించుకొని ఆమోదం పొందాలన్నారు. అలా చేయబడిన వారి పేర్లు మాత్రమే మెరిట్ లిస్టులో నమోదవుతాయన్నారు. ఆ అభ్యర్థులు మాత్రమే ఐటిఐలో ప్రవేశానికి అర్హులని పేర్కొన్నారు. సర్టిఫికేట్ వెరిఫికేషన్ చేసుకున్న అభ్యర్థులు మాత్రమే ఈనెల 29న జరుగు అడ్మిషన్ల కౌన్సిలింగ్‌కు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావల్సిందిగా కోరారు. మరిన్న వివరాలకు ఫోన్ నెంబర్లు : 75690 62449, 9491134464 సంప్రదించాలని సూచించారు.

మహిళా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

మహిళా సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర అన్నారు. సూపర్ సిక్స్ పథకాల్లో ఒకటైన మహిళలకు ఉచిత బస్సు సర్వీసు స్త్రీ శక్తి పథకం విజయవంతమైన సందర్భంగా మంగళవారం స్థానిక పాత బస్టాండ్ లో గల ఎన్టీఆర్ విగ్రహం నుంచి నాలుగు రోడ్ల కూడలి వరకు మహిళలతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బందంవారివీధిలో నిర్వహించిన బహిరంగ సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నీ పూర్తిస్థాయిలో అమలు చేస్తున్నామన్నారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించిన ప్రభుత్వం కూటమి ప్రభుత్వమని అన్నారు. నెలరోజుల వ్యవధిలో ఆరు కోట్ల మంది మహిళలు ఉచిత బస్సు సదుపాయాన్ని వినియోగించుకున్నారని అన్నారు. పథకాల అమలులో పక్క రాష్ట్రాలకు ఆదర్శంగా మన రాష్ట్ర ప్రభుత్వం నిలిచిందని అన్నారు. మీ పిల్లలకు మేము అండగా ఉంటాం అనే నినాదంతో తల్లికి వందనం పథకాన్ని అమలు చేశామన్నారు. అలాగే ఆటో డ్రైవర్లకు ప్రతి ఒక్కరికి రూ.15వేలు అందించనున్నట్టు తెలిపారు. సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయలేమని వైసిపి నాయకులు అసత్య ప్రచారాలు చేశారని, ఇప్పుడు ఈ పథకాలు అమలు చేయడాన్ని చూసి ఓర్వలేకపోతున్నారని అన్నారు. కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు బార్నాల సీతారాం, పట్టణ టిడిపి అధ్యక్ష, కార్యదర్శులు గుంట్రెడ్డి రవికుమార్, మజ్జి వెంకటేష్, నాయకులు బెలగాం జయప్రకాష్ నారాయణ, సారికి గణేష్, సిరిపురపు భాస్కరరావు, కౌన్సిలర్లు కోరాడ నారాయణరావు, బడే గౌరి నాయుడు, రణభేరి చిన్నం నాయుడు, పి.దివ్య, ఎఎంసి చైర్మన్ వైస్ చైర్మన్లు, డైరెక్టర్లు, టిడిపి నాయకులు, కార్యకర్తలు, సర్పంచులు, తదితరులు పాల్గొన్నారు.

సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయచంద్ర

రైతులు ఇ-పంటను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - గరుగుబిల్లి

జిల్లాలోని రైతులు ఇ-పంటను సద్వినియోగం చేసుకోవాలని, ఆ దిశగా చర్యలు చేపట్టాలని జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. మండలంలోని పెద్దూరు, గరుగుబిల్లి ప్రాంతాలను జెసి మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా పెద్దూరులోని రైతు సేవా కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. మొబైల్ యాప్‌లో ఇ - పంట నమోదు ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రైతులు తమ పంటల వివరాలను నమోదు చేసుకోవడానికి ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఒక వ్యవస్థ ఇ-పంట అని అన్నారు. రైతులు తమ వివరాలను నమోదు చేసుకోవడం ద్వారా పంటల బీమా వంటి ప్రయోజనాలను పొందవచ్చున్న విషయాన్ని రైతులకు వివరించాలని జెసి సిబ్బందికి సూచించారు. అంతకుముందు అదే గ్రామంలోని ప్రభుత్వ భూముల్లో అనధికార ఆక్రమణలకు సంబంధించి భూముల క్రమబద్ధీకరణ పథకం - 2025 అమలును తనిఖీ చేశారు. రెవెన్యూ అధికారులతో కలిసి సందర్శించి, లబ్ధిదారులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్న ఆయన ఈ పథకం గురించి లబ్ధిదారులకు అవగాహన కల్పించారు.. అనంతరం స్థానిక తహశీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి ఎస్‌యుఒఎంఒటిఒ సర్టిఫికేట్లు, మ్యుటేషన్ ఫైళ్లకు సంబంధించి తనిఖీ చేశారు. ఈ పర్యటనలో సంబంధిత మండలాల తహశీల్దార్లు, ఇతర అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆటో కార్మికులను ఆదుకోవాలి

ప్రజాశక్తి - సీతానగరం

ఆటో కార్మికులను ఆదుకోవాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రెడ్డి వేణు కోరారు. స్థానిక ఆటో స్టాండ్ వద్ద మంగళవారం నిరసన కార్యక్రమాన్ని చేపట్టి అనంతరం తహశీల్దార్ జె ప్రసన్న కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రెడ్డి వేణు మాట్లాడుతూ ఈనెల 18న చలో విజయవాడ సందర్భంగా మండల కేంద్రాల్లో ధర్నాలు చేపట్టాలని ఆటో యూనియన్ (సిఐటియు) పిలుపునిచ్చిందన్నారు. వాహన మిత్ర ప్రకటించిన రాష్ట్రం ప్రభుత్వం కార్మికులకు చలానాలు, ఇతర జరిమానాలు రూ.30వేలు అవుతుంటే, స్త్రీ శక్తి పేరుతో ఆటో కార్మికులు ఉపాధిని దెబ్బ తగులుతుందన్నారు. వీరిని ఆదుకోవడానికి వాహన మిత్ర రూ.20వేలకు పెంచాలని, ఇప్పటికే వాహనాలపై పెంచుతున్న చలానాలు, పన్నుల భారాలు తగ్గించాలని కోరారు. ఈనెల 19 వరకు దరఖాస్తు చేసుకొనే అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. 300 యూనిట్లు విద్యుత్ వినియోగించిన వారికి వాహన మిత్ర స్కీమును రద్దు చేస్తామనడం దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో మండల సిఐటియు కార్యదర్శి జి.వెంకటరమణ, ఆటో యూనియన్ నాయకులు పి.ఈశ్వరరావు, ఆటో కార్మికులు తోట శ్రీను, ఇజ్జాడ నారాయణరావు, ఆర్.అప్పలనాయుడు, సతీష్, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

తహశీల్దార్‌కు వినతిని అందజేస్తున్న సిఐటియు నాయకులు

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ ఉమామహేశ్వరి

గ్రామాల సుస్థిర అభివృద్ధికి సహకరించాలి

ప్రజాశక్తి - కురుపాం

గ్రామాలు సుస్థిర అభివృద్ధికి ప్రజా ప్రతినిధులు, ప్రజలు సహకరించాలని ఎంపిడిఒ జె. ఉమామహేశ్వరి అన్నారు. మంగళవారం మండలంలోని నీలకంఠాపురంలో ఆదికర్మ యోగి అభియాన్ కార్యక్రమంపై సర్పంచ్ ఎ.మన్మధరావు ఆధ్వర్యంలో జరిగిన సమావేశానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతి పివిటిజి గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ఐదేళ్ల ప్రణాళికతో ఆ గ్రామానికి కావాల్సిన మౌలిక సౌకర్యాలన్నీ రూపకల్పన చేసి దశల వారీగా కార్యక్రమాలు చేపట్టి అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం ప్రవేశ పెట్టిందన్నారు. కావున ప్రజలంతా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి వై.వెంకటనాయుడు, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

కుస్తీ పోటీల్లో గిరిజన విద్యార్థి ప్రతిభ

ప్రజాశక్తి - సాలూరు

అండర్ -17 అంతర్ జిల్లాల కుస్తీ పోటీల్లో మర్రి గహన ప్రతిభ కనబర్చాడు. మండలంలోని మావుడి గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థి ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు సింహాచలం తెలిపారు. ఈ విద్యార్థి మల్ల యుద్ధ పోటీల్లో ఎంపికైనందుకు పాఠశాల ఉపాధ్యాయులు, ఇతర సిబ్బంది, అభినందనలు తెలిపారు.

రాజు దంపతులను సన్మానిస్తున్న ఎంఇఒ, ఉపాధ్యాయులు

అంకిత భావంతో పనిచేయాలి

ప్రజాశక్తి - కొమరాడ

విధుల పట్ల ప్రతి ఉపాధ్యాయుడు అంకితభావంతో పనిచేసే మంచి పేరు తెచ్చుకోవాలని ఎంఇఒ జామి నారాయణస్వామి అన్నారు. మండలంలోని దుగ్గి మండల ప్రాథమిక పాఠశాలలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత పివిజె రాజుకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంఇఒ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు తీసుకున్న రాజు దంపతులను గ్రామస్తుల సమక్షంలో సత్కరించారు. ఈ సందర్భంగా ఎంఇఒ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి భవిష్యత్తును తీర్చిదిద్దేందుకు కంకణం కట్టుకున్న ప్రతి ఉపాధ్యాయుడు ఉత్తమ ఉపాధ్యాయుడే అని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులపై విద్యార్థుల తల్లిదండ్రులకు ఉన్న నమ్మకంతోనే పాఠశాలలకు పిల్లలను పంపిస్తున్నారన్నారు. ఆ నమ్మకంతో పిల్లల బంగారు భవిష్యత్తును తీర్చిదిద్దేందుకు ప్రతి ఉపాధ్యాయుడు నిరంతరం కృషి చేయాలని కోరారు. ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు రావడంతో విద్యాశాఖ అధికారులతో పాటు గ్రామస్తులు విద్యార్థుల తల్లిదండ్రులు ఉపాధ్యాయులు పీవీజే రాజుకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి 2 చిన్న తిరుపతిరావు పాఠశాల తోటి ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నేడు జిల్లా విస్తృత స్థాయి ఎస్‌సి సెల్ సమావేశం

ప్రజాశక్తి - సాలూరు

వైసిపి ఎస్‌సి సెల్ విస్తృతస్థాయి సమావేశం పార్వతీపురంలో వాసవీ భవనంలో బుధవారం జరుగుతుందని, ఈ సమావేశానికి ఎస్‌సిలంతా హాజరు కావాలని డిప్యూటీ మాజీ సిఎం పి.రాజన్నదొర అన్నారు. వైసిపి జిల్లా అధ్యక్షులు శత్రుచర్ల పరీక్షిత్ రాజు అధ్యక్షతన జరుగు ఈ సమావేశానికి వైసిపిఎ ఎస్‌సి సెల్ అధ్యక్షులు పిజెఆర్ సుధాకర్ బాబు పాల్గొంటారని తెలిపారు. కావున ఈ సమావేశానికి సాలూరు నియోజకవర్గంలో ఉండే మండల వైసిపి ఎస్‌సి సెల్ అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు, జిల్లా అనుబంధ విభాగాల అధ్యక్షులు, నియోజకవర్గ అనుబంధ విభాగాల అధ్యక్షులు, రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయి పార్టీ కమిటీలో వివిధ హోదాలో గల సభ్యులు, ఎంపిపి లు, జడ్పీటీసీలు, మాజీ కార్పొరేషన్ చైర్మన్లు, మాజీ డిసిసిబి, డిసిఎంఎస్ చైర్మన్లు, మున్సిపల్ చైర్మన్లు, కౌన్సిలర్లు, సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని పిలుపునిచ్చారు.

అర్హులందరికీ పక్కా ఇళ్లు : కమిషనర్

ప్రజాశక్తి - సాలూరు

పట్టణ పరిధిలో నివసించే పేదలైన వారందరికీ పిఎంవై 2.0 పథకం కింద పక్కా గృహాలు మంజూరు చేయనున్నట్టు మున్సిపల్ కమిషనర్ టిటి రత్నకుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులతో కలిపి పిఎంఎవై 2.0 బ్రోచర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులు, గృహనిర్మాణ అధికారులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు

వాయుపుత్ర సేవా సంఘం సభ్యుల రక్తదానం

ప్రజాశక్తి - కురుపాం

స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో రక్తహీనతతో మహిళ, బాలుడు బాధపడుతున్న విషయం తెలుసుకున్న వాయుపుత్ర సేవా సంఘం సభ్యులు ఐదుగురు మంగళవారం స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లి రక్తాన్ని దానం చేసి ఔదార్యాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది, రోగుల బంధులు, గ్రామ పెద్దలు వాయుపుత్ర సేవా సంఘ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

రహదారి, తాగునీటి సౌకర్యం కల్పించాలి

ప్రజాశక్తి - కొమరాడ

ఒడిశా సరిహద్దులో గల రెబ్బ, వనధార గిరిజన గ్రామాలకు రహదారి, మంచినీటి సౌకర్యం కల్పించాలని సిపిఎం జిల్లా కమిటీ నాయకులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. కొమరాడ మంగళవారం రెబ్బ, వనధార గ్రామస్తులతో కలిసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సాంబమూర్తి మాట్లాడుతూ రెబ్బ వనధార గ్రామాలకు రోడ్డు సౌకర్యం లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతూ విద్య, వైద్యం అందని పరిస్థితి ఉందని అన్నారు. ఈ రెండు గ్రామాలకు వర్షాకాలంలో తప్ప వేసవిలో మంచినీటి ఎద్దడి తీవ్రంగా ఉందన్నారు. అధికారులు స్పందించి ఈ రెండు గ్రామాలకు రోడ్డు, మంచినీటి సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నగేష్ మహేష్, తదితరులు పాల్గొన్నారు.

339 ప్రత్యేక వైద్య శిబిరాలు : డిఎంహెచ్ఒ

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

మహిళల ఆరోగ్యం కోసం కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ఆరోగ్య,కుటుంబ సంక్షేమ శాఖ ద్వారా నిర్వహిస్తున్న స్వస్త్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాలను జిల్లాలో విజయవంతం చేయాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్. భాస్కరరావు కోరారు. జిల్లాలో కార్యక్రమ పర్యవేక్షణకు విచ్చేసిన స్టేట్ నోడల్ అధికారి డాక్టర్ పి.గీతాపద్మజతో కలిసి ప్రోగ్రాం అధికారులకు ఆరోగ్య కార్యాలయంలో మంగళవారం సమీక్ష నిర్వహించారు. జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా వైద్యాధికారులకు కార్యక్రమ నిర్వహణపై సూచనలు చేశారు. స్వస్త నారి సశక్త్ పరివార్ అభియాన్ కింద 339 ప్రత్యేక వైద్య శిబిరాలను జిల్లాలోని అన్ని ఆరోగ్య కేంద్రాల్లో నిర్వహిస్తామన్నారు. శిబిరంలో14 కౌంటర్లను ఏర్పాటు చేసి అక్కడ నిర్దేశించిన ఆరోగ్య పరీక్షలు,వైద్య సేవలు అందజేయాలన్నారు. తగు చికిత్స అందజేసి రిఫరల్ అవసరమైన వారిని పర్యవేక్షణ చేయాలన్నారు. షెడ్యూల్ ప్రకారం అక్టోబర్2 వరకు ఆయా పరిధిలో కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో పలువురు వైద్యాధికారులు పాల్గొన్నారు.

పనుకుపేట ఎస్‌డబ్ల్యుపిసి పరిశీలన

సీతానగరం : మండలంలోని పనుకుపేట ఎస్‌డబ్ల్యుపిసి కేంద్రాన్ని ఇన్‌ఛార్జి ఎంపిడిఒ కెకె కుమార్ వర్మ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తడి చెత్త, పొడి చెత్తను వేరుచేసి వర్మీకంపోస్టు తయారుచేసి సేంద్రియ ఎరువుకు ఉపయోగపడుతుందని, దీన్ని ద్వారా ఆర్థిక వనరులు పంచాయతీ సేకరించుకోవాలన్నారు. అలాగే నీళ్ల ట్యాంకులను శుభ్రం చేయాలన్నారు.

రమ్మన్నారు... వద్దన్నారు

ఎమ్మెల్సీ హాజరు పట్ల అధికారుల తీరుపై వైసిపి సభ్యుల నిరసన

ప్రజాశక్తి - పాలకొండ

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ ఆహ్వానంపై గందరగోళం చోటు చేసుకుంది. వారం రోజుల క్రితం సభ్యులతో పాటు ఎమ్మెల్సీకి కూడా ఆహ్వానాన్ని అధికారులు పంపారు. అయితే మంగళవారం ఎంపిడిఒ మురళీధర్ ఎక్కడ ఓటు ఉంటే అక్కడ సమావేశానికి వెళ్లాలని పంచాయతీరాజ్ యాక్టును ఉతపరుస్తూ ఎమ్మెల్సీ ఇంటికి నోటీసు పంపారు. అయినప్పటికీ ఎమ్మెల్సీ జెడ్‌పిటిసి పాలవలస గౌరీ పార్వతితో పాటు ఎంపిటిసి సభ్యులు, సర్పంచులతో కలిసి సమావేశానికి వెళ్లగా ప్రధాన గేటు దగ్గర పోలీసులు అడ్డగించారు. దీంతో కొంత ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. డిఎస్‌పి ఎం.రాంబాబు కలుగజేసుకొని మాట్లాడారు. దీంతో ఎమ్మెల్సీ పోలీసుల తీరుపై అసహనం చెందారు. జిఎడి నుంచి తాను లిఖితపూర్వకంగా జీవో కాపీ తెచ్చుకున్నానని, ప్రోటోకాల్ ప్రకారం తాను వెళ్తానని పట్టుపెట్టారు. ఈ సమావేశానికి పిలిచే బాధ్యత ఎంపిడిఒదేనని, ఆయన చెబితే లోపలికి పంపిస్తామని డిఎస్‌పి చెప్పగా అక్కడున్న వైసిపి నాయకులు అడ్డుతగిలారు. ఏ హోదా లేని వారిని లోపలికి పంపిస్తున్నారని, ఎమ్మెల్సీని బయట ఉంచడం సరికాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తనకు వర్తించిన నిబంధనలే ఎమ్మెల్యే కూడా వర్తిస్తుందని, ఎమ్మెల్యేని కూడా పంపించొద్దంటూ ఎమ్మెల్సీ పట్టు పెట్టారు. ఒక దశలో అక్కడే కూర్చోడానికి ప్రయత్నించగా పోలీసులు అందుకు అంగీకరించలేదు. నిరసన తెలియజేసే అధికారం తనకు లేదా అంటూ ఎమ్మెల్సీ ప్రశ్నించారు. చివరికి ఎంపిడిఒ మురళీధర్ అక్కడకు చేరుకోగా ఇదేం పద్ధతి అంటూ ఎమ్మెల్సీ ఆయపై మండిపడ్డారు. తాను ఇన్‌ఛార్జి ఎంపిడిఒనని చెప్పగా సెలవు పెట్టి వెళ్లిపోండి... చేతనైతే పని చేయండి అంటూ అసంతృప్తి వ్యక్తం చేశారు. తాను రావొద్దంటూ లిఖిత పూర్వకంగా నోటీసు ఇస్తే ఇక్కడ నుంచి వెళ్తానని ఎమ్మెల్సీ అనడంతో పని ఒత్తిడి ఉండడం వల్ల ఆహ్వానం పంపించానని, పంచాయతీరాజ్ యాక్ట్ ప్రకారం ఎక్కడ ఓటు ఉంటే అక్కడకు ఎమ్మెల్సీ వెళ్లాలని ఇన్‌ఛార్జి ఎంపిడిఒ లిఖిత పూర్వకంగా లేఖ ఇవ్వడం పట్ల ఎమ్మెల్సీ మండిపడ్డారు. బాధ్యత గల అధికారి ఇలా ఇవ్వడం హాస్యాస్పదంగా ఉందన్నారు. దీంతో ఎంపిడిఒ డౌన్ డౌన్... కూటమి నిరంకుశత్వం విడనాడాలి అంటూ నిరసన తెలియజేస్తూ వెనతిరిగారు.

డిఎస్‌పితో చర్చిస్తున్న ఎమ్మెల్సీ విక్రాంత్

అధికారులు సహకారంతోనే మండల అభివృద్ధి : ఎమ్మెల్యే

అధికారుల సహకారంతోనే మండల అభివృద్ధి జరుగుతుందని స్థానిక ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ అన్నారు. మంగళవారం స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో ఎంపిపి బొమ్మల భాను అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. అభివృద్ధి జరగాలంటే అధికారులు, రాజకీయ నాయకులు సమన్వయంతో ముందుకు వెళ్లాలన్నారు. కొన్ని సమస్యలను అధికారులు నిబంధనలతో ముడిపెట్టకుండా మానవతా దృక్పథంతో ఆలోచించి పరిష్కారానికి చొరవ చూపాలన్నారు. రీ సర్వేలో ఎక్కువ తప్పులు జరిగినట్టు తమ దృష్టికి వస్తుందని, దీనిపై రెవెన్యూ అధికారులు దృష్టి సారించాలని అన్నారు. వ్యవసాయశాఖపై జరిగిన చర్చలో పలువురు సభ్యులు యూరియా కొరతపై మండల వ్యవసాయ శాఖ అధికారి ప్రసాదరావును నిలదీశారు దీనిపై ఎమ్మెల్యే కలుగ చేసుకొని మాట్లాడుతూ మూడు రోజుల్లో యూరియా కొరత తీరుతుందని హామీ ఇచ్చారు. వైద్య, ఆరోగ్యశాఖపై జరిగిన చర్చలో అర్తలి దగ్గర పిహెచ్‌సి ఏర్పాటుకు గతంలో ప్రతిపాదన ఉండేదని, దీనిపై మరోసారి ప్రణాళిక తయారు చేయాలని ఎం.సింగపురం వైద్యా అధికారిని ప్రత్యేక ఆహ్వానితులు కె.అప్పలనాయుడు కోరారు. ఆర్‌అండ్‌బి, దేవాదాయశాఖ అధికారులు ఒక్క సమావేశం కూడా రావడం లేదని వారికి నోటీసులు జారీ చేయాలని ప్రత్యేక ఆహ్వానితులు జాడ శ్రీధర్ అన్నారు. సమావేశంలో వైస్ ఎంపిపి వాకముడి అనిల్, తహశీల్దార్ రాధాకృష్ణమూర్తి, పలుశాఖల అధికారులు, సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు పాల్గొన్నారు.

నేటి నుంచి వాహనమిత్ర దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

వాహనమిత్ర దరఖాస్తులను బుధవారం నుంచి జిల్లాలోని గ్రామ, వార్డు సచివాలయాల్లో స్వీకరించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఎన్.ప్రభాకరరెడ్డి తెలిపారు. అర్హత పొందిన వారికి పథకం కింద ప్రభుత్వం రూ.15వేలు ఆర్థిక సాయం అందజేయనుందని, ఈ మేరకు ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసిందని మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో కలెక్టర్ తెలిపారు. కావున జిల్లాలో అర్హత కలిగిన వారంతా ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.

జిల్లా ఆసుపత్రిలో నేడు వైద్య శిబిరం

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

స్థానిక జిల్లా ఆసుపత్రిలో బుధవారం మెడికల్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఆసుపత్రుల సమన్వయాధికారి డాక్టర్ జి.నాగభూషణరావు తెలిపారు. స్వస్థ నారీ శక్తి పరివార్ అభియాన్‌లో భాగంగా ఈ క్యాంపును నిర్వహిస్తున్నట్లు వివరించారు. మహిళలు, పిల్లల ఆరోగ్య సమస్యల పరిష్కారానికి ఇది చక్కని వేదికని, దీన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో కోరారు. మహిళల్లో ఉండే అన్ని అనారోగ్య సమస్యల స్క్రీనింగ్ పరీక్షలతో పాటు కౌన్సెలింగ్ సేవలు అందించనున్నట్లు అన్నారు. కావున ఈ సదావకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలియజేశారు.

యూరియా దాచుకున్నారు

తుమరాడలో రైతులు ఆందోళన

ప్రజాశక్తి - పాలకొండ

యూరియా కొరత రైతులకు వెంటాడుతుంది. ఒక్క బస్తా దొరికితే చాలన్న పరిస్థితుల్లో రైతులతో ఎదురుచూస్తున్నారు. యూరియా కోసం రైతులు రైతుసేవా కేంద్రాలు, పిఎసిఎస్‌లు, ప్రైవేట్ షాపులకు పరుగులు పెడుతున్నారు. బ్లాక్ నైనా కొనుగోలు చేయడానికి రైతుల సిద్ధపడుతున్నారు. అయితే మండలంలో తుమరాడ రైతు సేవా కేంద్రానికి మంగళవారం 110 బస్తాలు యూరియా రాగా 60 బస్తాలు రైతులు అందించి మిగిలిన బస్తాలను రైతు సేవా కేంద్రంలో ఉంచి తాళాలు వేశారు. దీంతో అక్కడ ఉన్న రైతులు ఎరువులు ఉంటుండగా ఎందుకు తాళాలు వేస్తున్నారని ప్రశ్నించగా, సిబ్బంది సమాధానం చెప్పలేదు. దీంతో రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ఇదే విషయాన్ని విలేకరులు సచివాలయం సిబ్బందిని అడగ్గా ఎడి ఉంచాన్నారని తెలిపారు.

మండల సమావేశం వాయిదా

ప్రజాశక్తి - సీతంపేట

మండల సర్వసభ్య సమావేశం మంగళవారం స్థానిక వెలుగు కార్యాలయంలో నిర్వహించడానికి ఏర్పాట్లు చేసినప్పటికీ ప్రజాప్రతినిధుల కోరం లేకపోవడంతో బుధవారానికి వాయిదా వేసినట్లు ఎంపిడిఒ బీబీ మిశ్రో తెలిపారు. పలువురు సర్పంచులు, అధికారులు హాజరైనప్పటికీ కోరం లేకపోవడంతో నిరాశతో వెనుదిగారు. ఇప్పటికే ఎంపిపి ఆదినారాయణ, జెడ్‌పిటిసి లక్ష్మి, ఎంపిడిఒ మిశ్రో, తహశీల్దార్ శ్రీకన్య, ఉపతహశీల్దార్, డిప్యూటీ ఎంపిడిఒ, పలువురు అధికారులు హాజరయ్యారు.

ఓజోన్‌పొరను కాపాడుకోవాలి

ప్రజాశక్తి - సీతంపేట

జిల్లాలో పలుచోట్ల ఓజోన్ పొర పరిరక్షణ దినోత్సవం నిర్వహించారు. మండలంలోని దిగువసారలో ఆర్ట్స్, వాసన స్వచ్ఛంద సంస్థలు సంయుక్తంగా నిర్వహించిన ఓజోన్ పొర పరిరక్షణ దినోత్సవం సందర్భంగా సమావేశం నిర్వహించారు. వాసన్ ప్రతినిధి నర్సింగరావు మాట్లాడుతూ పర్యావరణం రక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్య పద్ధతిలో పచ్చదనాన్ని పెంపొందించి కాలుష్యాన్ని తగ్గించి ఓజోన్ పొరను రక్షించేందుకు కృషి చేయాలని తెలిపారు. మన్యం సహజ సిఇఒ బి.శంకర్రావు మాట్లాడుతూ ఓజోన్ పొర సూర్యుని నుంచి వచ్చే హానికరమైన అతినీలలోహిత (యువి) కిరణాలను గ్రహించి, భూమిపై జీవం మనుగడకు అవసరమైన వాతావరణాన్ని సృష్టిస్తుందన్నారు. కావున ప్రతి ఒక్కరూ దీన్ని కాపాడాలని తెలిపారు. కార్యక్రమంలో వాసన సంస్థ ప్రతినిధులు ఉదయ్ కుమార్, వెంకట్రావు, పద్మ, గౌతమి, సిఇఒలు కృష్ణారావు, గోవిందరావు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : ప్రతి ఒక్కరూ కాలుష్యాన్ని నివారించి ఓజోన్ పొరను పరిరక్షించుకోవాలని స్థానిక కెజిబివి పాఠశాల ఎస్ఒ శ్రీరంజని కోరారు. ఓజోన్ దినోత్సవాన్ని పురస్కరించుకొని పాఠశాలలో విద్యార్థులు 0.3 జోన్ ఆకారంలో ప్రదర్శనలు, ర్యాలీ చేసి అవగాహన చేపట్టారు. అనంతరం ఎస్ఒ మాట్లాడుతూ ఓజోన్ పొర లేనిదే మనిషి మనుగడ కష్టంగా మారుతుందని అన్నారు. కాలుష్యాన్ని నివారించే పర్యావరణాన్ని పెంపొందించాలని పిలుపునిచ్చారు.

ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో....

కాలుష్య కోరలు అణచి మనల్ని మనం కాపాడుకోవడానికి ఓజోన్ పొరను రక్షించు కోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డా టి. శ్రీవరం అన్నారు. కెమిస్ట్రీ అధ్యాపకులు చిన్నారావు ఏర్పాటు చేసిన ప్రపంచ ఓజోన్ డే సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడారు. అనంతరం విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. వైస్ ప్రిన్సిపాల్ రామయ్య, ఐ క్యు ఎ సి కో ఆర్డినేటర్ స్వరూప, సత్యారావు, చిన్నారావు, విద్యార్థులు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : 0.3జోన్ నమూనాలో కూర్చున్న విద్యార్థులు

వీరఘట్టం: మండలంలోని కిమ్మి మోడల్ ప్రైమరీ పాఠశాలలో ఓజోన్ ఆకారంలో విద్యార్థులను కూర్చుని పెట్టారు. వీరఘట్టం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులచే ప్లకార్డులు చేతపట్టారు. జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో పాఠశాల నుంచి ప్రధాన రహదారి మీదుగా అంబేద్కర్ జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రతిజ్ఞ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కెపి నాగమణి, బి.సోంబోర, జి.సింహాచలం, సైన్స్ ఉపాధ్యాయులు వెంకట్రావ్, జి లక్ష్మణరావు, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాలలో కుంటుపడుతున్న సౌకర్యాలు

సమస్యలు పరిష్కరించాలి : సిఐటియు

ప్రజాశక్తి - మక్కువ

గిరిజన ఆశ్రమ పాఠశాలలో సౌకర్యాలు కుంటిపడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడంలేదని, తక్షణమే నిధులు కేటాయించి సమస్యలు తీర్చాలని సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్‌వై నాయుడు డిమాండ్ చేశారు. మండలంలోని ఎర్రసైమంతవలసలో గల గిరిజన ఆశ్రమ పాఠశాలను మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా పరిధిలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ బాల, బాలికల ఉన్నత పాఠశాల అన్నింటిలో తీవ్ర సమస్యలతో విద్యార్థులు చదువులు కొనసాగిస్తున్నారని, తక్షణమే ఐటిడిఎ పిఒ నిధులు కేటాయించి సౌకర్యాలు మెరుగుపరచాలని డిమాండ్ చేశారు. జిల్లాలో అన్ని ఆశ్రమ పాఠశాలలకు వెంటనే ఎఎన్ఎం పోస్టులు మంజూరు చేయాలన్నారు. గతంలో మంత్రి ప్రకటించిన హామీ అమలు చేయాలని, గిరిజన ప్రాంతాల్లో నర్సింగ్ పూర్తిచేసిన గిరిజన అమ్మాయిలకు ఎఎన్ఎం పోస్టులు కు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. అలాగే జిల్లాలోని అనేక ఆశ్రమ పాఠశాలల్లో కుక్‌లు, హెల్పర్లు, అటెండర్లు పోస్టులు ఖాళీలు ఉన్నాయని, తక్షణమే ప్రభుత్వమే నాన్ టీచింగ్ సిబ్బంది కొరత తీర్చాలని కోరారు. వర్షాకాలంలో నిరంతరం వరద ముంపునకు గురవుతున్న వైఎస్ వలస ఆశ్రమ పాఠశాల ముంపునకు గురికాకుండా ప్రత్యామ్నాయ చర్యలు అధికారులు తీసుకోవాలని కోరారు. జిల్లాలో సీతంపేట, పార్వతీపురం ఐటిడిఎ పరిధిలో 61 మంది థర్డ్ పార్టీ కింద ఆశ్రమ పాఠశాలల్లో నాన్ టీచింగ్ సిబ్బంది పనిచేస్తున్నారని, వారందర్నీ పర్మినెంట్ చేసి, కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆదివాసి గిరిజన సంఘం నాయకులు ఆర్లప్ప, చిన్న రాజు, మహేంద్ర, రవి పాల్గొన్నారు

ఆశ్రమ పాఠశాలలో ఆరుబయట వంటను పరిశీలిస్తున్న సిఐటియు నాయకులు

అంతర్ పంటలతో అధిక లాభాలు

ప్రజాశక్తి - సాలూరు

రైతులు ప్రధాన పంటలతో కలిపి అంతర్ పంటలుగా వివిధ రకాలైన పంటలు వేసుకున్నట్లయితే దాని ద్వారా అధిక లాభాలను ఆర్జించవచ్చని అజీమ్ ప్రేమ్‌జీ ఫౌండేషన్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ వేషవిల్లా తెలిపారు. మంగళవారం తోణాం పంచాయతీ పరిధిలో గల దిగువ మెండంగి, కూడకారులో దీక్ష మహిళా వెల్ఫేర్ సొసైటీ, మండలి సంస్థ వారి ఆధ్వర్యంలో అజీమ్ ప్రేమ్ జీ ఫౌండేషన్ వారి సహకారంతో ప్రకృతి వ్యసాయంలో భాగంగా జీడీ తోటల రైతుల పొలాల్లో అంతర్ పంటలు పసుపు, పైనాపిల్, రాగి, మిల్లెట్స్, వరిపంటలను పరిశీలించిన ఆమె రైతులను ఉద్దేశించి మాట్లాడారు. గిరిజన ప్రాంతాల్లో పండించే జీడితోటల నుంచి వచ్చే జీడిపప్పుకు మార్కెట్లో మంచి మద్దతు ధర వస్తుందని దీనికి ప్రధాన కారణం రసాయనికి ఎరువులు వాడకుండా కేవలం ప్రకృతి వ్యవసాయంతోటే వాటిని పెంచడమేనన్నారు. ఈ ప్రాంతంలో పండే జీడిపప్పుకు ఇతర ప్రాంతాలలో పండించే జీడిపప్పుకు చాలా తేడా ఉందన్నారు. ఈ పంటల్లో అంతర్ పంటలను వేసుకొని అదనపు ఆదాయాన్ని పొంది ఆదర్శ రైతులుగా ఉండాలని ఆమె ఆకాంక్షించారు. ఫౌండేషన్ ద్వారా అన్ని రకాల సహాయ సహకారాలను గిరిజన రైతులకు అందించేందుకు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటామని ఆమె తెలిపారు. అనంతరం దీక్ష మహిళా వెల్ఫేర్ సిఇఒ శాంతితో కలిసి జీడి తోటలను, వాటిలో అంతర్ పంటలుగా వేసిన వివిధ రకాలైన పంటలను ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

గ్రామాల్లో విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు

మండల సర్వసభ్య సమావేశంలో సభ్యుల ధ్వజం

ప్రజాశక్తి వీరఘట్టం

గ్రామాల్లో విచ్చలవిడిగా బెల్ట్ షాపుల ద్వారా మద్యం విక్రయాలు జరుగుతున్నాయని, పలువురు సభ్యులు మండల సర్వసభ్య సమావేశంలో ఎక్సైజ్ అధికారులపై ధ్వజమెత్తారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి డి.వెంకటరమనాయుడు అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. పాలకొండ ఎక్సైజ్ అధికారి మాట్లాడుతుండగా తూడి, నీలానగరం సర్పంచులు కె.వెంకటరమణ, పాలవలస పురుషోత్తంనాయుడు తూడిలో ఎనిమిది బెల్ట్ షాపులు ఉన్నాయని, మద్యం వల్ల అసాంఘిక కార్యక్రమాలు ఎక్కువై శాంతి భద్రతలకు విఘాతం కల్పిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. నీలానగరంలో నాటు సారా విక్రయాలు జోరుగా సాగుతున్నాయన్నారు. అనంతరం ఎస్సై మాట్లాడుతూ తమ పరిధిలోని నాలుగు మండలాలున్నాయని, సిబ్బంది కొరత ఉందన్నారు. సారా తయారీపై గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చలివేంద్రి ఎంపిటిసి పోరెడ్డి వెంకట నాయుడు మాట్లాడుతూ సచివాలయానికి 222 యూరియా బస్తాలు వచ్చాయని, అవి ఎక్కడున్నాయి ఎవరి దగ్గర ఉన్నాయని ప్రశ్నించారు. యూరియా బస్తాలు ఉంచేందుకు రైతు సేవా కేంద్రం లేకపోవడంతో వేరే గృహంలో ఉంచామని ఎఒ సౌజన్య వివరణ ఇచ్చారు. ఎంపీపీ, తూడి సర్పంచి మాట్లాడుతూ రైతులకు యూరియా పంపిణీ చేయడంలో వ్యవసాయ శాఖ విఫలమైందని, ముందస్తు చర్యలు లేకపోవడంతో యూరియా కోసం రైతులు రోడ్డు ఎక్కవలసిన పరిస్థితి ఏర్పడిందని అన్నారు. అనంతరం వివిధశాఖలపై సభ్యులు నిలదీశారు. సమావేశంలో ఎంపిడిఒ, తహశీల్దార్, పలుశాఖల అధికారులు, సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు పాల్గొన్నారు.

ప్రకృతి సేద్యంతో ఆరోగ్యకరమైన ఉత్పత్తులు

ప్రజాశక్తి - మక్కువ

రైతులు ప్రకతి వ్యవసాయం వైపు మొగ్గు చూపడం వల్ల ఆరోగ్యకరమైన ఉత్పత్తులు పొందగలుగుతారని ప్రకృతి వ్యవసాయ శాఖ జిల్లా ప్రబంధువులు శ్రావణ్ కుమార్ అన్నారు మండలంలోని పనసభద్రలో రైతు డి.ధనబాబు ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో వరి రైజ్డ్ బెడ్ మోడల్‌లో సాగుచేస్తున్న పొలాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం చేయడం వల్ల ఆరోగ్యకరమైన ఆహార ఉత్పత్తులు లభించడం జరుగుతుందని, భూమిలో సేంద్రీయ కర్బన శాతం పెంచడం వల్ల పంటల దిగుబడులు ఆశాజనకంగా ఉంటాయని రైతులకు సూచించారు ఈ విధమైన సేద్యం వల్ల అటు ప్రకృతిని, ఇటు భూమిని కాపాడినవారు అవుతామన్నారు. ఈ పద్ధతిలో సాగు చేస్తున్న రైతు ధనబాబు తన అనుభవాలను తెలిపారు. పొలం పిలుస్తుంది కార్యక్రమంలో భాగంలో మండల వ్యవసాయాధికారి భారతి మాట్లాడుతూ వరిలో ఈ విధమైన బహుళ పంటల సాగు వల్ల ఏడాది పొడవునా భూమిని కప్పి ఉంచడంతో పాటు అదనపు ఆదాయాన్ని పొంద వచ్చని, ప్రభుత్వం కూడా ప్రకృతి వ్యవసా యానికి అధిక ప్రాధాన్యత ఇవ్వడం జరుగు తుందని, రైతులు సద్వినియోగం చేసుకోవాల న్నారు. కార్యక్రమంలో విహెచ్ఎ రమణమ్మ, ఎన్ఎఫ్ఎలు పి.దేవీప్రసాద్, రవితేజ, యూనిట్ ఇన్‌ఛార్జి ఉర్లక నాగార్జున, ఐసిఆర్‌పిలు రెడ్డి సుందరరావు, దీసరి వెంకటరావు, పాపారావు, రైతులు పాల్గొన్నారు.

గురుకుల ఉపాధ్యాయులను కొనసాగించాలి

ప్రజాశక్తి -గుమ్మలక్ష్మీపురం

గిరిజన సంక్షేమ గురుకుల ఉపాధ్యాయులను యధావిధిగా కొనసాగించాలని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్‌కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం గుమ్మలక్ష్మీపురంలో ఉపాధ్యాయులతో సమావేశమ య్యారు. ఈ సందర్భంగా రంజిత్ కుమార్ మాట్లాడుతూ లోకేష్ పాదయాత్ర చేసినప్పుడు గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలల్లో అవుట్ సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న ఉపాధ్యాయులను రెగ్యులర్ "చేస్తామని హామీలు ఇచ్చి ఇప్పుడు వీరి పోస్టులు డిఎస్సీలో చూపించడం అన్యాయం అన్నారు. 2024 డిసెంబర్‌లో జరిగిన సమ్మె సందర్భంగా గిరిజన సంక్షేమ శాఖ మంత్రి కూడా మీ ఉద్యోగాలకు ఎటువంటి ఇబ్బందీ ఉండదని చెప్పారని, మళ్లీ డిఎస్సీ ఎంపికలో గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలల్లో "వెబ్ ఆప్షన్లు ఇవ్వడం ఏమిటని ప్రశ్నించారు. విద్యా శాఖ మంత్రి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి ఇచ్చిన మాట ప్రకారం గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలల్లో అవుట్ సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న ఉపాధ్యాయులను యధావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో దోని సురేష్,గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలల, కళాశాలల అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షుడు నిమ్మక దివాకం, నాయకులు శ్రీను, వెంకట్, తదితరులు పాల్గొన్నారు.

మనుమకొండలో మౌలిక సదుపాయాలు : పిఒ

ప్రజాశక్తి - భామిని

నీతిఅయోగ్ ఆదర్శ గ్రామంగా ఎంపికైన మనముకొండలో పూర్తిస్థాయి మౌలిక సదుపాయాలు కల్పిస్తామని ఐటిడిఎ పిఒ పవర్ స్వప్నల్ జగన్నాథం అన్నారు. మంగళవారం మనుమ కొండ గ్రామాన్ని పిఒ సందర్శించారు. ప్రధానంగా స్థానికంగా అవసరమైన మౌలిక సదుపాయాలపై స్థానికులతో చర్చించారు. గ్రామ అభివృద్ధికి అవసరమైన అంశాలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలోని విడివికె, అంగన్వాడి కేంద్రాలను పరిశీలించారు. విడివికె ఉత్పత్తులకు మార్కెట్ సదుపాయం కల్పిస్తామని తెలిపారు. అనంతరం బత్తిలి పిహెచ్‌సిని పరిశీలించారు. ఆరోగ్య కేంద్రంలోని సిబ్బంది హాజరు పట్టీ, నిల్వ ఉన్న మందులను, ప్రసవ గది, హాస్పిటల్ పరిసరాలను పరిశీలించారు. అనంతరం భామిని ఆదర్శ ఏకలవ్య పాఠశాలను పరిశీలించారు. ఏకలవ్య పాఠశాలలో ప్రహరీ గోడ నిర్మాణం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఐటిడిఎ ఎఇని ఆదేశించారు. ఈ పాఠశాల పరిసరాల్లో ఉన్న పిచ్చి మొక్కలను వెంటనే తొలగించాలని సూచించారు. ఏకలవ్య విద్యార్థులతో మాట్లాడి పాఠశాల సమస్యలపై ఆరా తీశారు. కార్యక్రమంలో ఎపిఒ చిన్నబాబు, తహశీల్దార్ శివన్నారాయణ, ఉపాధ్యాయుల, వైద్య సిబ్బంది ఉన్నారు

375మంది పింఛనుదారులకు నోటీసులు

ప్రజాశక్తి - గరుగుబిల్లి

375 మంది అనర్హులైన పింఛన్ దారులకు నోటీసులు ఇచ్చినట్లు ఎంపిడిఒ జి. పైడితల్లి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో 67 వృద్ధాప్యం పింఛన్లు, 300మంది పింఛన్‌దారులు రీఅసెస్మెంట్ కోసం (అప్పీల్) దరఖాస్తు చేసుకున్నారని అన్నారు. అలాగే మిగిలిన 8మంది ఎలాంటి అప్పీల్ కోసం దరఖాస్తు చేయలేదన్నారు. ప్రభుత్వం నిబంధనలు ప్రకారం పింఛన్ మంజూరు చేస్తామన్నారు.

IN THE HONOURABLE COURT OF THE JUNIOR CIVIL JUDGE AT PATHAPATNAM.
IA. 265/2023 IN OS 28/2025

Between:
Smt Korikena Laxmi. .....Petitionner/Plaintiff
And:
Paidesetti Bhaskara Rao .....Respondent/ Defendant
To,
PaidiShetty Bhaskara rao, S/o late Savarayya, aged about 34years, presently residing at C/o Yerra Krishna Colony, besides Sai Durga Medical store and Sri Venkateswara Kirana general Store, Parvathi Puram, Parvathipuram Post and Parvathipuram Mandal, Manyam DIstrict, Pin535501, A.P.

పై నంబర్ గల IA లో మీరు Respondent/Defendant గా ఉన్నారు పై కోర్టు వారు మీకు నోటీసు నిమిత్తము **తేదీ 25-09-2025 వాయిదా అయి ఉన్నది.** సదరు పైన తెలిపిన **తేదీన ఉదయం 10:30 నిమిషములకు** కోర్టు వారి ఎదుట స్వయంగా గాని వకీల్ ద్వారా గాని హాజరై మీ యొక్క ఆక్షేపణలు తెలియజేసుకొనవలెను అట్లు లేనియెడల శ్రీ కోర్టు వారు మీ పరోక్షమున విచారించి తీర్మానించడం మొదలైన ఈ నోటీసు మూలంగా తెలియజేయడమైనది

// శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు మేరకు //

బాడన వెంకటప్పలనాయుడు
ఏపీ830/2019,
న్యాయవాది,
పాతపట్నం ,శ్రీకాకుళం జిల్లా,
సెల్ 9440418229.

బహిరంగ నోటీసు
మహారాజశ్రీ సీనియర్ జడ్జి వారి కోర్టు, పార్వతీపురం
ఓ.ఎస్. 7/2021

1) పెంట చినతల్లి .... వాది
మరియు
నీరస అచ్చమ్మ వగైరాలు ....ప్రతివాదులు

3వ ప్రతివాది :
నీరస ధనుంజయ నాయుడు, వయస్సు 34 సం॥లు, తండ్రి లేటు తిరుపతి నాయుడు, నివాసము : డోరు నెం.2-1, కొమరాడ గ్రామం, కొమరాడ మండలం, పార్వతీపురం మన్యం జిల్లా.

పై నెంబరు దావాలో వాది అయిన పెంట చినతల్లి మహారాజశ్రీ సీనియర్ జడ్జి వారి కోర్టు, పార్వతీపురంలో దాఖలు చేసిన దావా ఓ.యస్. నెం.7/2021 నెంబరు దావాలో మీరు 3వ ప్రతివాదియై ఉన్నారు. సదరు దావాలో నోటీసులు జారీ కాబడినప్పటికి మీరు నేటి వరకు హాజరు కానందున పేపరు ప్రకటన ద్వారా నోటీసు జారీ చేయంపించి యున్నారు. సదరు దావా **తే.10.10.2025** నాటికి వాయిదా అయి ఉన్నది. కావున పైన పేర్కొన్న దావాలోను మీకు వాదన ఉన్న యెడల మీ వ్రాతమూలక స్టేట్మెంట్ వగైరాలు ఉన్న యెడల వాటితో సహ పై వాయిదా తేదీన, సదరు కోర్టులో వ్యక్తిగతముగా గాని లేదా తమ న్యాయవాది ద్వారా గాని హాజరై తమ వాదన మరియు లిఖితములను దాఖలు జేయవలసినదిగా మహారాజశ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారము ప్రకటన ద్వారా తెలియజేయడమైనది. పై చెప్పబడిన తేదిన హాజరు కాకుండ తప్పి పోయే యెడల మీ పరోక్షమందు పై వాద్యమును విమర్శ చేసి మహారాజశ్రీ కోర్టు వారు తీర్మానించడమగునని కోర్టు వారి ఉత్తర్వులు అనుసరించి ఈ ప్రకటన ద్వారా తెలియజేయడమైనది.

ఎమ్. బెనర్జీ,
ఏడ్వోకేట్, బొబ్బిలి,
విజయనగరం జిల్లా,
సెల్ నెం. 9440592366.